# రొమాన్స్



శ్రీ వంగల లక్ష్మీ నరసింహాచార్య.

రామం ఎఫ్. ఏ. జూనియరు చదువుతున్నాడు మనిషి చామనచాయగా వుంటాడు. వేషభాషల్నిబట్టి చూస్తే భాగ్యవంతుని బిడ్డలాగుంటాడు. చదువు చూస్తే అయ్యవారు నోరునొక్కుకోవలసిందే! మోడరన్ స్టూడెంటుకు వుండవలసిన లక్షణాలకు ఏమీ లోటు చేయడు రామం.

అతనిక్లాసులోనే పుష్పవల్లి అనే అమ్మాయి వుంది. ఆమె నిజంగా మన ఫిలింస్టార్‌కంటె చాలా అందవతి. వింటి బద్దలు వంటి ఆమె కనుబొమ్మలూ, ధగధగ మెరిసే కళ్ళూ, గుండ్రటి మొగమూ, దొండపండు వంటి ఆమె పెదవులూ, ఆ పెదవుల మీద నాట్యమాడే చిరునవ్వూ రామాన్ని భ్రమింపజేశాయి. అతడేకాదు; చూచిన ప్రతివాడూ తప్పక భ్రమించి తీరుతాడు.

రామం ఆమెను చూచినప్పటినుంచీ, విచిత్రంగామారిపోయాడు. చదువుకో నమస్కారం పెట్టాడు, అతడసలు పరీక్షకు మానేసి, ప్రేమపరీక్షకు చదవటం మొదలెట్టాడు. రామం తన ప్రియురాలి చల్లటి ప్రేమ చూపులకోసం చాలా అవస్తపడ్డాడు. కాని, పుష్పవల్లి ఇతనిమీద అనుగ్రహించినట్లు కనపడదు. ఒకవేళ తానామెను ప్రేమించినట్లు తెలుసో తెలియదో?

సుదర్శనుడితని స్నేహితుడు. స్కూలు నాటకాల్లో స్త్రీపాత్రలు అద్భుతంగా నటించేవాడు. ఇతనిలో ఒకగొప్పశక్తివుంది. అదేమిటంటే, ఎదుటివాళ్ళయొక్క మనోభావాలు చూచిన వెంటనే గ్రహిస్తాడు. మిత్రునికి గల్గిన వింతమార్పును గ్రహించాడు.

ఒకనాటి సాయంకాలము సుదర్శనుడు, రామాన్ని చూద్దామని బయలుదేరాడు. రామం గూడా షికారునకు గామోసు, డ్రెస్సువేసుకుంటున్నాడు. సుదర్శనాన్ని చూసి "ఏమి భాయ్! మీయింటికే వద్దామనుకుంటున్నా. సరే, నీవే వచ్చావు" అని అంటూ రూముతాళంవేసి స్నేహితులిద్దరూ బయలుదేరారు. అప్పుడు ఒకకారు వీరిప్రక్కనుంచేపోయింది. వెనకసీటులో ఒక యువతి కూర్చొని వుంది. ఆమె చిరునవ్వుతో వీరివైపుచూసింది. మిత్రులిద్దరూ దాన్ని గమనించారు. సుదర్శనునిలోమాత్రము యేమీ మార్పు కనపడలా, కాని రామం స్తితి వర్ణించ శక్యంగాకుండావుంది. నడిరోడ్డుమీద కొయ్యలాగ నుంచొని రయ్‌మని పోతూవున్న కారువైపు తదేకదృష్టితో చూస్తున్నాడు. ఆ విధంగా ఎంతసేపు నుంచున్నాడో అతనికే తెలియదు. సుదర్శనుడువచ్చి భుజాలు తట్టేసరికి, అతడీ ప్రపంచంలోనికి వూడిపడ్డాడు.

"ఏమిభాయ్! సంగతేమిటి?" అని చిరునవ్వుతో తనకేమీ తెలియనట్లడిగాడు.

రామం తన గుట్టుమట్టులు తెలిసిపోయాయేమో అని ఖంగారుపడి "అబ్బే! ఏమీ లేదురా! ఆవెధవడ్రైవరు మనకు చాలా ప్రక్కనుంచి కారుపోనిస్తే వీడికింత పొగరేమిటాయని ఆలోచిస్తున్నాన"ని అన్నాడు.

"నిజమేరా ఈకారు డ్రైవర్లకు బుద్ధి లేదు!"

"చూడరా! ఆ కారులో స్టుపిడ్! పుష్పవల్లి కూర్చుని నన్ను ఇన్‌సల్టు (అవమానం) చేసిందిరా".

"రామం! అది ఇన్‌సల్టుగాదురా! అదీ....

"అదీ అని అసంపూర్తిగా పల్కేటప్పటికి రామం తెల్లబోయి తాను పుష్పను ప్రేమించినట్లు తెలిసిందేమో ని అనుమానపడ్డాడు. అతడు తాను పుష్పను ప్రేమించినట్లితరులకు తెలియదని.

"అయితే రామం! నేనో ప్రశ్న అడుగుతాను. నిజంచెప్తావూ?" దాంతోటి రామం గుండెలు గుభేలుమన్నాయి. తమ విషయం యేమయినా అడుగుతాడేమోయని. పైకి బెట్టు సరిగా "బ్రదర్! నీకు యేవిషయంలో అబద్ధం చెప్పానురా?" "లేదులే! ఈమధ్య నీలో వొక వింతమార్పు కలిగింది. చదువు చూస్తే హుళక్కి. మనిషి చూస్తే ఎప్పుడూ ఏదో ఆలోచిస్తున్నట్లుంటావు. కారణం యేమిటి?"

రామానికేమీ తోచలా. తనరహస్యమంతా గ్రహించాడనుకొన్నాడు. దాచినా యేమీ ప్రయోజనంలేదు.

"అబ్బే యేమీలేదురా!.........." అని నెమ్మదిగా అన్నాడు.

"బ్రదర్! నాదగ్గర దాస్తావట్రా!...." అని నవ్వటం ప్రారంభించేడు.

"నేనేం దాస్తున్నానేమిటి?"

"అయ్యగారు ప్రేమ విలాసాల్లో పడి మునిగిపోతూవున్నారుటగా!..........."

ఇంకేముంది! తన రహస్యం వెల్లడయి పోయింది!

"బ్రదర్! స్త్రీలకు బుద్ధిలేదురా!" అన్నాడు రామం.

"అదేమిటిరోయ్! యేమి జరిగిందేమిటి?"

"మహా నీకు తెలియనట్టు అడుగుతావేం?........"

"కొంతవరకు తెలుసు అయితే తమరు పుష్పవల్లి గారిని........?...."

"నీవుగూడా హాస్యమేనటరా!" అని దీనంగా అన్నాడు రామం.

"అబ్బే! వూరికే అన్నాను! నీవు ఆమెను ప్రేమించావన్నమాట!"

"(అతనివైపు చూసి) ఊ!"

"ఇంకా రిప్లయి (జబాబు) రాలేదన్నమాట."

"ఊ!"

"అయితే ఈ Delay (ఆలస్యం) దేనికేం?........"

"(ఆలోచిస్తూ) ఏమయినాఅవనీ! రేపు ఆమెకోవుత్తరం వ్రాయటమో, లేక ఆమెతో పెర్సనల్ (ముఖాముఖిగా) మాట్లాడటమో జరగాలి. నేనింక వూరుకోలేను!"

"జాగ్రత్తరోయ్! ఆమె ఎవరో తెలుసా!"

"తెలియకేం! ప్రిన్సిపాల్‌గారి కూతురు."

"ఏమయినా కొంటెపని చేశావంటే ఈ కాలేజీలోంచి మోతం యిప్పిస్తారు!"

రామం మాట్లాడలేదు. స్నేహితులిద్దరూ యిళ్ళకు జేరుకున్నారు.

— ౨ —

మరునాడు రామం క్లాసుకు వచ్చాడు. క్లాసులో వింతయేమీ కనపడలేదు. ఆరోజున పుష్పతో కలిసి మాట్లాడాలని అనుకున్నాడు. సాయంత్రం 4.30 అయింది. కాలేజీ విడిచిపెట్టారు. స్టూడెంట్సు మేడదిగి కొందరాటలకువెళ్ళారు. కొందరిళ్ళకు వెళ్ళారు. మనరామం మాత్రం మేడదిగలేదు. అప్పుడు మంచి అత్తరువాసన ఘుమాయిస్తోంది. మేడ ఎక్కుతున్నట్లు చప్పుడయింది. ఎవరాయని తలుపుదగ్గరకువచ్చి చూశాడు. ఆ! వచ్చింది..........తన ప్రేమైక మూర్తి పుష్ప! రామం ఆమెను చూసే చూడనట్టుగా నటించి నెమ్మదిగా మేడమెట్లు దిగటం ప్రారంభించాడు. పుష్ప చిరునవ్వు నవ్వుతూ అతనివైపు చూస్తూనే మేడమెట్లెక్కింది.

సాయంత్రం ఆరుగంటలయింది. రామం రూములోకి వచ్చాడు. గది అంతా చీకటి. గోడకున్నస్విచ్చినొక్కాడు. విద్యుద్దీపం వెలిగింది. డ్రెస్సు విప్పుకుంటూ టేబుల్ దగ్గరవున్న కుర్చీమీద కూర్చున్నాడు. హఠాత్తుగా అతనిదృష్టి ఒకకవరుమీదపడింది. అతడు దాన్ని టేబిల్‌మీదనుంచి, తీసుకొని నాల్గువైపులా తిప్పి చూశాడు. దాన్ని విప్పి చదువుకొన్నాడు. అతడొక్కసారిగా ఆనంద సాగరంలో మునిగిపోయాడు. తన కళ్ళను తానే నమ్మలేకపోయాడు. మళ్ళీ చదివాడు; తృప్తి కలగలా; ఆవిధంగా ఆ వుత్తరాన్ని ఎన్నిసార్లు చదివాడో లెక్కలేదు. తాను ఏ ప్రియురాలుకోసం నానావస్థలూ పడుతున్నాడో, ఎవతె యొక్క ప్రేమవీక్షణములు కోసం తాను చదువుకో నమస్కారం పెట్టాడో, ఆ ప్రియురాలు "పుష్పవల్లి" తనకో కవరు వ్రాసింది. ఆమెగూడా తనను చాలా ప్రేమించినట్లూ, బహిరంగంగా మాట్లాడటానికి కొన్ని ఆటంకములున్నట్లూ, అందుచేత ఆనాటిరాత్రి 11 గంటలకు "Womens club" (స్త్రీల క్లబ్బుకు) దయవుంచి రావలసినదని ప్రార్థిస్తున్నట్లూ వుంది.

అతడు కార్యక్రమమేమిటా అని ఆలోచించాడు. వెంటనేస్నానంచేసి భోజనం చేస్తున్నా, మనస్సుమాత్రం పరిపరివిధాల పోతోంది. తాను వెళ్తే ముందెవరు మాట్లాడాలి? తను మాట్లాడితే తన Dignityకు లోపం వస్తుందేమో? ఆమె తప్పకుండా అక్కడకు వస్తుందా? నిన్న నవ్విన చిరునవ్వుకు అర్థమిదేకాబోలు! అని ఆలోచించుకుంటూనే భోజనం త్వరత్వరగా ముగించాడు. తర్వాత క్రాపుతో అరగంటదాకా తెమిలేదు కాదు. కాసేపు మధ్య పాపటతీసాడు. కాసేపు పైకి ఎగదువ్వాడు. ఈవిధంగా అవస్తపడి చివరకు పక్క పాపటతోగాని సంతృప్తిపడలా. తర్వాత డ్రెస్సువిషయమై గోలవచ్చింది. ఆరోజునే చాకలి బట్టలు తీసుకెళ్ళాడు. మంచివన్నీ మాసిపోయాయి. చివరకు, క్రొత్తగా కుట్టించిన సిల్కుసూటూ, బ్లేజర్‌కోటూ, పోలోకాలరు షర్టు తొడుక్కొని, కాళ్ళకు కలకత్తా స్లిప్పర్సువేసుకొని, మంచి అత్తరు పూసుకొన్నాడు. ఈ వేషం అంతా అయ్యేసరికి సుమారు 10 గంటలయింది. అక్కడనుంచి ఏమిటా చెయ్యడం అని ఆలోచించాడు. చేతికి రిస్టువాచీ పెట్టుకోవటం మరచిపోయినాననుకుంటూ, టేబుల్‌మీదవున్న దాన్నితీసుకొని అలంకరించుకొన్నాడు. ఎంతసేపు చూసినా గడియారములో 11 గంటలయేటట్లు కనపడదు. ఒకవేళ దారిలో ఎవరైనా,-ఎవరైనా యేమిటి? సుదర్శనం వంటివాడు కనిపిస్తే, తన పరువు దక్కుతుందా? అప్పటిమాట చూసుకోవచ్చులే అని మనస్సును సమాధాన పరచుకొన్నాడు. అంతలో గోడ గడియారం అరగంట కొట్టింది. వేషం సరిగావుందా లేదాఅనివకసారి చూసుకొని, నెమ్మదిగా బయలుదేరబోయాడు

తీరా వాకిట్లోకి వచ్చేటప్పటికి వక పిల్లి ఎదురైంది, దాంతోటి అతనికి కోపంవచ్చి, తన్నటానికి స్లిప్పరు తీయబోయాడు, కాని అదిఅప్పుడేపారిపోయింది. కా సే పు యింట్లో కూర్చొని బయలుదేరాడు. గడియారం సరిగా 10-45 అయింది. తిన్నగా క్లబ్బుదోవపట్టాడు. దారిలో సువాసన కిళ్లీ వకటికొని నములుత్తూ బయలుదేరాడు. చుట్టూ చూసుకుంటూ, ఎవరైనా తనను చూస్తున్నారేమో అనే భయంచేత దొంగలాగ నడిచాడు ఊరంతా మాటు మణిగివుంది.

3

నెమ్మదిగా రామం క్లబ్బుజేరాడు, గేటు తీసివుంది. అది తనప్రియురాలుచేసిన యేర్పాటనుకొని చాలా సంతోషిస్తూ లోపలికి వెళ్ళాడు, అది వరండా తన బ్యాటరీ లైటు వెలిగిద్దా మనుకొన్నాడు. కాని ఏమి ప్రమాదంవస్తుందో అని వూరుకొని నెమ్మదిగా "పుష్పా!" అని పిలిచాడు. ఎదుటి గదిలో నుంచి కాటోలు "ఊ!" అని జబాబువచ్చింది ఆతడు ఎదుటి గదిలోనికి వెళ్ళటం ప్రారంభించేడు. ఆతని కాగదిలోనుంచి అత్తరు పరిమళం వచ్చింది. ఒకవేళ తన ప్రియురాలే రాసుకుందేమోఅనుకొని గదిలోకి వెళ్లాడు. తన బ్యాటరీ లైటు కాంతిని నాల్గువైపులా ప్రసరింపచేశాడు. ఒక గోడవైపు మొహంపెట్టి వొకయువతి కూర్చునివుంది. ఎవరైనా చూస్తారని కాటోలు మేలి ముసుగు వేసుకుంది. సిగ్గునటిస్తూ లేచి నిలబడింది.

"పుష్పా, ఈ రోజుకా నీకు నామీద దయ వచ్చింది! నీకోసం నేనెంత కష్టపడ్డానో తెలుసునా! నిన్న నావైపు నీవుచూసి చిరునవ్వు నవ్విందాకా నాకు మనశ్శాంతి లేకపోయింది సుమా!" అంటూ వుపోద్ఘాతం చెప్పాడు రామం!

ఆమె "ఉహూ!" అని మాత్రం అంది.

"నీ చల్లటి చూపులు నామీద వొకసారి ప్రసరింపవూ?"

జబాబులేదు.

"చదువుకున్నదానవు, నీకు గూడా సిగ్గేనా పుష్పా!" అంటూ నెమ్మదిగా ఆమెను సమీపించాడు, రామం ఆమె హస్తాన్ని స్పృశించాడు. తన ఎడమచేత్తో, ఆమె మేలిముసుగు తొలగించాడు. వెంటనే ప్రక్కగదిలోనుంచి పకపకా నవ్వుతూ కొంతమంది స్టూడెంట్సు బిలాబిలా బయటికివచ్చారు. రామం మొహాన కత్తి వ్రేటుకైనా నెత్తురుచుక్కలేదు. కొయ్య అయిపోయాడు. ఆ కుర్చీమీద కూర్చున్నది యువతికాదు—యువకుడు! అతడెవడు? సుదర్శనం! ఆతడు తన వేషాన్ని తీసేసుకొని "బ్రదర్! బాగుందా!........" అని నవ్వటం ప్రారంభించాడు. అందర్నీ నరికివేశేద్దామా అన్నంతకోపం వచ్చింది రామానికి. తనకు భరింపరాని అవమానం అయినందుకూ యేడుపుగూడా వచ్చింది. స్నేహితులిది కనిపెట్టి "బ్రదర్! ఊరికే తమాషాకు చేశామురా!" అని బ్రతిమాలారు. ఆందరూ ఆ రహస్యాన్ని వెల్లడిచేయము అని వాగ్దానంచేశారు. సుదర్శనం రామాన్ని చూసి "బ్రదర్! కోపంవద్దు. నేను చెప్పేది విను! పుష్పవల్లి కిదివరకే పెళ్ళి అయింది. ఆమె యెప్పుడూ చిరునవ్వుతో వుండటం స్వభావసిద్ధం. అది నీకు తెలియక వేరర్థం చేసుకొన్నావు. ఏదో కొంచెపనిచేసి ఈ కాలేజీలోంచి మోక్షం తెచ్చుకొంటావని గ్రహించి నీకు వార్నింగు యిద్దామని ఈ పని చేశాము. పిచ్చి పిచ్చి భ్రమల్ని దూరం చేసుకో" అని చిన్న సలహాలాగున యిచ్చాడు.

మరునాడు క్లాసులో పుష్పవల్లి. యథాప్రకారంగా చిరునవ్వుతో ప్రత్యక్షమయింది. రామంకు ఆమెను చూడగానే గుండె గుభేలుమంది. ఆ కలవరపాటు చూచి, తన రహస్యమెరిగిన కొందరు స్నేహితులు నవ్వుకున్నారు. ఇంతవరకూ రామం మళ్ళీ ఆమె వైపైనా చూడలేదు.

కాబట్టి ఏ యువతైనా తననుజూచి నవ్వితే, ఆమె తనమీద ప్రేమగలిగి నవ్విందనుకోటం పొరబాటు; కాని అంతమాత్రం యోచించే బుర్ర ఎక్కడుంటుంది మన రామం వంటివాళ్ళకు! దీనినే పెద్దలు "బలవా నింద్రియగ్రామో విద్వాంస మపికర్షతి!" అని అన్నారు. దీనినే ఒక కవి:

గీ॥ "మోహ మినుపతాళములతో మొహరించు,
ఇంద్రియము వేత్తలకుగూడ తంద్రగొల్ప."

అని అన్నాడు,

చక్కని అచ్చుకు
రామా ప్రెస్,
తెనాలి.